క్లుప్తంగా

మైనార్టీ గురుకులం పరిశీలన



ప్రిన్సిపాల్ ఫిరోజ్‌తో మాట్లాడుతున్న ఎంపీటీసీ వెంకటరమణరెడ్డి

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు సమీపంలో గల మైనార్టీ గురుకుల పాఠశాలను సోమవారం చించోలి(బి) ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఇస్మాయిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్ మహ్మద్ ఫిరోజ్‌కు సూచించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం



కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, తదితరులు

నిర్మల్‌టౌన్: వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్, ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రెయినేజీలు నిండి రోడ్డుపై చేరింది. సోమవారం ఆయా కాలనీలో చైర్మన్ పర్యటించారు. దగ్గరుండి సిబ్బందితో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే సమాచారం అందించాలన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బాసర: రవీంద్రపూర్ కాలనీలో ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో సమస్యలపై ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు కాలనీవాసులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతోపాటు తదితర సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నెలరోజుల్లో పాఠశాలకి పునర్వైభవం తీసుకువస్తానని హామీ ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ తుకరాం సోమవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అధ్యాపకులు చిన్నయ్య, వినోద్, శ్రీనివాస్, విఠల్ ఉన్నారు.

ప్లేట్‌లు, గ్లాసులు అందజేత

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన దుల్లె దినేశ్ రూ.9 వేల విలువ గల ప్లేట్‌లు, గ్లాసులు అందజేశారు. 60 మంది విద్యార్థులకు స్థానిక నాయకులు సోమవారం వీటిని పంపిణీ చేశారు. నాయకులు దుల్లె వెంకటేశ్, సత్తెన్న, సురేశ్, తదితరులు ఉన్నారు.

రేపు మండల సమావేశం

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, ఆయాశాఖల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

వామ్మో కుక్కలు

- పట్టణంలో స్వైరవిహారం
- దాడిలో గాయపడ్డ పలువురు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఎన్టీఆర్ మినీస్టేడియంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడ్డ యువకుడు, రెండేళ్ల బాలుడు, బాలుడు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని 42 వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాలనీల్లో స్వైరవిహారం చేస్తూ గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వారం వ్యవధిలో మూడు, నాలుగుసార్లు ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కుక్కల బెడద కారణంగా వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు బడికి వెళ్లేటప్పుడు ఇతరులు తోడుగా వెళ్లాల్సి వస్తుంది. అర్ధరాత్రి సమయంలో కుక్కలు వెంటపడడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడిపోతున్నారు. కుక్కల బెడద నియంత్రించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

కుక్కల బెడద తీవ్రంగా మారడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఏటా కుక్కల సంఖ్యను లెక్కిస్తూ.. వృద్ధి చెందకుండా కు.ని ఆపరేషన్లు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఎవరైనా తమ కాలనీలో కుక్కల సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఆ ప్రాంతానికి వెళ్లి ఒకటి, రెండు కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో కాలనీలో వీధి కుక్కల సంఖ్య సుమారు 100 ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

ఘటనలు ఇవి..

- జిల్లాకేంద్రంలోని గాజులపేట్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ షేక్ అజ్గర్ కుమారుడు రెండేళ్ల బాలుడు షేక్ రోహన్‌పై ఈనెల 19న రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కలు గుంపుగా ఒకేసారి దాడి చేశాయి. బాలుడు కేకలు విన్న చుట్టుపక్కల వారు రాళ్లు, కర్రలతో తరిమేసి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.
- బంగల్‌పేట్, నాయుడువాడ కాలనీల్లో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.
- మంజులాపూర్ శివాజీనగర్ కాలనీలో ఈనెల 21న ఓ ఇంటి బయట పిల్లలు ఆడుకుంటూ ఉండగా.. ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చింది.

కుక్కల బెడద నియంత్రించాలి



కాలనీల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే జనం భయపడాల్సి వస్తుంది. కుక్కల బెడద నియంత్రించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
– కర్రోళ్ల శంకర్ యాదవ్, మంజులాపూర్

చర్యలు చేపట్టాం



వరుస ఘటనల నేపథ్యంలో సోమవారం నుంచి పట్టణంలో కుక్కలు పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇది నిరంతరం కొనసాగుతుంది. పట్టుకున్న కుక్కలను జిల్లా సరిహద్దుకు దూరంగా వదిలిపెడతాం.
– మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: జిల్లాలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవికాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత లోపం తీవ్రంగా ఉందని, స్కావెంజర్‌లు నియమించాలని, మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. బదిలీల అనంతరం పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు మురళీ మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రవికాంత్, వహీద్ ఖాన్, గౌరవాధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు రఘువీరపాణి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ కు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సభ్యులు దినేష్, జశ్వంత్ ,లక్ష్మణ్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కాకతీయ యూనివర్సిటీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 నుంచి మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లించలేదన్నారు. దీంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పెన్షనర్లు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హనుమంత్‌రెడ్డి, యూనిట్ అధ్యక్షుడు పి.విలాస్, కార్యదర్శి పి.జనార్దన్, జిల్లా, యూనిట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం హామీతో ఆందోళన వాయిదా!

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 24 నుంచి 29 వరకు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు యాకమల్లు, అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయులు, కార్తీక్‌లు సీఎం రేవంత్‌రెడ్డి, సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ దేవసేనలను సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తాత్కాలికంగా నిరసన, ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వెల్లడించారు.

సర్కారు బడిలో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించానని తెలిపారు. కేజీబీవీ ప్రహరీ ఎత్తు పెంచడంతోపాటు ప్లే గ్రౌండ్ చదును చేయిస్తానన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకుని, మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, ఎస్‌వో విమల, శంకర్, భూషణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన సోమవారం జరిగిన చివరిసారి మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలకు విద్య, వైద్యం , వ్యవసాయ, అటవీ, గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు ఎంతో కీలకమన్నారు. ప్రజలు ఫోన్‌చేస్తే అధికారులు వెంటనే స్పందించాలన్నారు. పనిచేయడం ఇష్టం లేనివారు వేరేచోటుకు వెళ్లవచ్చని తెలిపారు. అధికారులకు ఏవైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలన్నారు. డబుల్‌బెడ్రూం కాలనీలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. మార్నింగ్‌వాక్, ఫోన్ ఇన్ వంటి కార్యక్రమాలతో తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటానన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

సమావేశంలో మండల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అధికారులు నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫోన్ చేస్తే స్పందించడం లేదని సత్తన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బాలమృతం ప్యాకెట్లు ఎక్స్‌పైరి సరఫరా చేయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సీడీపీవో సరిత తెలిపారు. అయిల్‌పాం అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎంపికయ్యారని ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మానిక తెలిపారు. ప్రత్యేక అధికారులతోపాటు కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఎంపీపీ మోహిద్ తెలిపారు.

సమస్యలపై వినతులు

అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడికుంట సమీపంలో గల పోడు భూముల సమస్య పరిష్కరించాలని సేవ్యానాయక్‌తండా గిరిజనులు ఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబం మామిడి తోటలో నివాసముంటుంది. ఈ విషయమై ‘ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు’శీర్షికన మార్చి 26న సాక్షిలో కథనం ప్రచురితమైంది. పేద కుటుంబం సోమవారం ఎమ్మెల్యేని కలిశారు. డబుల్ బెడ్రూం కాలనీలో ఖాళీగా ఉన్న ఓ ఇంట్లో తాత్కాలికంగా ఉండాలని, తర్వాత శాశ్వతంగా ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు సమస్యలపై ఇచ్చిన వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు.

అంగన్‌వాడీల ధర్నా



నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ పిలుపుతో చేపట్టిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడారు. సమ్మె కాలపు జీతం చెల్లించాలని, రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఉపాలి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మకుమారి, రమాదేవి, అర్చన, వనమాల, చంద్రకళ, సునీత, జయంతిమాల పాల్గొన్నారు.

గోదాం ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న దీక్షిత్ రావు

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామంలోని గోదాంను ఎఫ్‌సీఐ సభ్యుడు దీక్షిత్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం నిర్వహణ, నిల్వ బియ్యం, రిజిస్టర్ తదితర వివరాలను టీఏను అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతానన్నారు.

వాహనాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని పలు వాహనాలు, ప్రైవేటు పాఠశాలల బస్సులను ఎంవీఐ ముతుజాఅలీ సోమవారం తనిఖీ చేశారు. అన్ని వాహనాలు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

‘అధిక ఫీజులు అరికట్టాలి’

ఖానాపూర్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు చేస్తున్న ఫీజులను ప్రభుత్వం అరికట్టాలని ఏబీవీపీ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 26న అన్ని పాఠశాలల బంద్ పాటించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



ముట్టడిస్తున్న గడ్‌చాంద గ్రామస్తులు

లోకేశ్వరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం గడ్‌చాంద గ్రామస్తులు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కింద ముంపునకు గురైన భూముల్లో కొందరు పంటలు సాగుచేస్తూ భూములు కబ్జా చేశారన్నారు. పశువులు మేతకు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై ఈనెల 10న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు. కాగా, తహసీల్దార్ మోతీరాం ఉన్నతాధికారులకు నివేదిస్తామనడంతో వెనుదిరిగారు. ఆపై నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో రైతులు ఫిర్యాదు చేశారు.

అదనపు బస్సు ట్రిప్పులు నడపాలని నిరసన



లింబా(బి)లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కుంటాల: కుంటాల నుంచి భైంసాకు అదనపు ఆర్టీసీ బస్సు ట్రిప్పులు నడపాలని లింబా (బి) గ్రామంలో గ్రామస్తులు బస్సును ఆపి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భైంసా డిపో నుంచి వానల్‌పాడ్, లింబా(కే) గ్రామాల మీదుగా లింబా(బి) గ్రామానికి ప్రతీరోజు ఐదు ట్రిప్పుల బస్సులు నడిపేవారని పేర్కొన్నారు. కుంటాల, భైంసాకు ప్రయాణికులు రాకపోకలు సాగించేవారని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం తప్ప మధ్యాహ్నం బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపూర్ వరకు నడిపించే నైట్ హాల్ట్‌బస్ ప్రతిరోజు ఆలస్యంతో నిజామాబాద్, ఆదిలాబాద్ దూరప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవడం లేదని తెలిపారు.

కూలిన అక్విడక్ట్



కుంటాల: మండలంలోని ఓలా శివారులో కాళేశ్వరం ప్రధాన కాలువపై అక్విడక్ట్(పై వంతెన) ఇటీవల నిర్మించారు. ఈ పనులకు సెంట్రింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, మట్టి పోసి తాత్కాలికంగా స్లాబ్ వేశారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి స్లాబ్ పూర్తిగా కూలింది. సంబంధిత కాంట్రాక్టర్ తాత్కాలిక పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారని రైతులు పేర్కొన్నారు. నాసిరకంగా నిర్మించడంతో కూలిపోయిందని వాపోతున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

సారంగపూర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాకల్యాణి అన్నారు. పాఠశాలలో పిల్లల్లో లీడర్ షిప్ క్వాలిటీని అభివృద్ధి చేయడానికి గాను సోమవారం స్కూల్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. కెప్టెన్‌గా విజయలక్ష్మి, వైస్ కెప్టెన్‌గా వైష్ణవి, లిటరసీ లీడర్‌గా సుహాని, కల్చరల్ కార్యదర్శిగా రుచిత, ఆరోగ్య పర్యవేక్షకులుగా వర్ష అనే విద్యార్థులను ఎంపిక చేశారు. సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

బిల్లుల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



కలెక్టరేట్ కార్యాలయం నిరసన తెలియజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని సమీకృత కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ 8 నెలల నుండి మధ్యాహ్న భోజనం కార్మికుల జీతాలు, 5 నెలల బిల్లులు పెడింగ్‌లో ఉన్నాయని వివరించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేసి పెడుతున్నారన్నారు. గృహలక్ష్మి పథకం మధ్యాహ్న భోజన పథకానికి వర్తింపజేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన యూనియన్ జిల్లా కె.రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సత్తవ్వ, లింగవ్వ, ఆసిబాన్, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఎమర్జెన్సీ దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలో ఎమర్జెన్సీని విధించి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10:30 గంటలకు యాంటీ ఎమర్జెన్సీ దినోత్సవం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకుడు శాంత కుమార్, ఎంసీ లింగన్న హాజరవుతారని పేర్కొన్నారు. మేధావులు, నాయకులు, పుర ప్రముఖులు, ప్రజలు గంటలకు రావాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌పటేల్, అడెల్ల ఇటీవల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రామారావుపటేల్ సోమవారం పరామర్శించారు. నాయకులు అశోక్, సోలంకిభీంరావు, దుబాయ్ శ్రీను, రమేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన పోతుగంటి సాయన్న (75) సోమవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, జెడ్పీటీసీ రాజేశ్వర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, నాయకులు గంగారాం తదితరులు ఉన్నారు.